‘పది’ పరీక్షలకు సర్వం సిద్ధం



తోటగరువు హైస్కూల్

ఆరిలోవ: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తూర్పు నియోజకవర్గంలో కేటాయించిన పరీక్ష కేంద్రాలను ఇప్పటికే విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో మూడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక సంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల ఉన్నాయి. వాటితో పాటు కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిల్లో వేలాది మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ప్రస్తుతం వారంతా సోమవారం నుంచి జరగబోయే పబ్లిక్ పరీక్షలకు సిద్ధమయ్యారు. నియోజకవర్గంలో సుమారు 5,500 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గురుకులం విద్యార్థులు 636 మంది కాగా, మిగిలిన వారంతా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులే. ప్రభుత్వ పాఠశాలల్లో 265 మంది బాలికలు.. 371 మంది బాలురు ఉన్నారు. నియోజకవర్గంలో సోమవారం నుంచి జరగనున్న పరీక్షల కోసం విద్యాశాఖ అధికారులు 15 కేంద్రాలను కేటాయించారు. వీటిని సుమారు 4 వేల మంది విద్యార్థులకు కేటాయించారు. జీవీఎంసీ జోన్–2 పరిధిలో 7, జోన్–3 పరిధిలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జోన్–2 పరిధిలో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు కేంద్రాలు, శ్రీకృష్ణాపురం గురుకులం, భారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్, విజేత స్కూల్, శ్రీకృష్ణా గ్రామర్ స్కూల్, విశాలాక్షినగర్‌లో బీవీకే ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. జోన్–3లో కేడీపీఎం, ఏయూ ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రైవేట్ స్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం ఇప్పటికే అధికారులు ఏర్పాట్లు చేశారు. తాగునీరు, పరీక్ష గదిలో బెంచీలు, ఫ్యాన్‌లు అందుబాటులో ఉంచారు.

తోటగరువులో పక్కా ఏర్పాట్లు

విద్యాశాఖ అధికారులు ఆదేశాలతో అన్ని పరీక్ష కేంద్రాలు మాదిరిగా తోటగరువు ఉన్నత పాఠశాలలోని రెండు కేంద్రాల్లో పక్కా ఏర్పాట్లు చేశాం. పరీక్ష జరుగుతున్న సమయంలో కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. విద్యార్థులకు తాగునీటి సదుపాయం కల్పించాం. బందోబస్తు కోసం ఆరిలోవ పోలీసులకు, వైద్య సదుపాయం కోసం ఆరిలోవ ఆరోగ్య కేంద్రం వైద్యులకు లేఖలు రాశాం. అన్ని తరగతి గదుల్లోనూ బెంచీలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు సిద్ధం చేశాం.

– కె.దుర్గాభవాని, హెచ్ఎం, తోటగరువు ఉన్నత పాఠశాల

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఈవో



పరీక్ష కేంద్రంలో పరిశీలన చేస్తున్న డీఈవో చంద్రకళ

సింహాచలం: పెందుర్తి మండలంలోని పదోతరగతి పరీక్షలు జరిగే పలు కేంద్రాలను ఆదివారం డీఈవో చంద్రకళ పరిశీలించారు. పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్, గుర్రంపాలెం, సరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లను ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ఏవిధంగా ఏర్పాట్లు చేశారో స్వయంగా పరిశీలించారు. ప్రతీ కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆమె చెప్పారు.

నేడు పోలమాంబ తొలేళ్ల ఉత్సవం

- అనుపు మహోత్సవం రేపు
- భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాలతో పోలమాంబ ఆలయం



ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం జరగనుంది. స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద తొలేళ్ల ఉత్సవాలు జరపనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అనుపు మహోత్సవం జరగనుంది. ఈ రెండు రోజులూ అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా తెలిపారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే రోడ్డు మార్గాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం జరిగే ప్రధాన పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు. చలువ పందిరి, ఆలయ ప్రాంగణంలో టెంట్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు వివిధ క్యూలైన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రవేశాలు కల్పించనున్నారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేయనున్నట్టు చైర్మన్ తెలిపారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. తొలిపూజ, పంచామృతాభిషేకాలకు రూ.1516 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ



బీఎన్‌ఆర్ నగర్‌లో పేదలకు నిత్యావసర సరకులు అందిస్తున్న సేవా స్ఫూర్తి సభ్యులు

ఆరిలోవ: తోటగరువు దరి బీఎన్‌ఆర్ నగర్‌లో నాగరత్నం, ఐలయ్య వృద్ధ దంపతులు నివాసముంటున్నారు. నాగరత్నం కొన్నాళ్లుగా అనారోగ్యంతో మంచం పట్టింది. ఐలయ్య వృద్ధాప్యంతో పనిచేయలేకపోతున్నారు. దీంతో వారికి పూటగడవని పరిస్థితి నెలకొంది. స్థానికులు ఎవరైనా భోజనం పెడితే ఆ పూట గడుస్తుంది. ఈ విషయం తెలుసుకున్న రవీంద్రనగర్‌లో సేవా స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఆ నిరుపేద వృద్ధ దంపతుల ఇంటికి వెళ్లి 25 కిలోల బియ్యం, పప్పులు, పంచదార, నూనె, చింతపండు తదితర నిత్యావసర సరకులు అందించారు. దీంతో అసోసియేషన్ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు పాత్రుడు, ఎం.వి.అప్పలరాజు, లక్ష్మణరావు, నమ్మి గణేష్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం పండగ



ఆరిలోవ కాలనీలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు

ఆరిలోవ: మట్టల ఆదివారం పండగను ఆరిలోవ ప్రాంతంలో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈత కొమ్మలు, ఏసుక్రీస్తుకు సంబంధించిన సూక్తులతో రాసిన ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలు చేపట్టారు. పలు చర్చిలకు చెందిన పాస్టర్లు ఆధ్వర్యంలో ఆరిలోవ కాలనీ నుంచి దుర్గాబజార్, టీపీసీ పాయింట్, బాలాజీనగర్, గాంధీనగర్, రవీంద్రనగర్ వరకు, కొండవాలు ప్రాంతాలలో హనుమంతవాక నుంచి సంజయ్‌గాంధీకాలనీ, పెదగదిలి, చినగదిలి వరకు ఈ ర్యాలీలు నిర్వహించారు.

వివాహిత ఆత్మహత్య



వరలక్ష్మి మృతదేహం

ఆరిలోవ: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోటగరువు సమీప గాంధీనగర్‌లో వాసుపల్లి వరలక్ష్మి(47), భర్త ఉమాపతి నివాసముంటున్నారు. వీరికి పిల్లలు లేరు. ఉమాపతి రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి. వరలక్ష్మి చీరల వ్యాపారం చేసేది. చీరలు అరువు పద్ధతి విక్రయించేది. ఈ డబ్బులు వసూలు కాకపోవడంతో వ్యాపారంలో నష్టం వచ్చింది. ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీనికి తోడు ఆరోగ్యం కూడా బాగోకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉమాపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థలు, రైల్వే ఏరియా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఐసీడబ్ల్యూఏ భవన్ పక్కన, అక్కయ్యపాలెం హైవే వద్ద గల సత్యసాయిబాబా సాయిసౌధలో కోచింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి మే 13 వరకు శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 92480 52173, 63003 66227, 73860 86177 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

సత్యసాయి భక్తుల రక్తదానం



రక్తదానం చేస్తున్న శ్రీ సత్యసాయిబాబా భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అత్యవసర రోగులకు అందించేందుకు వీలుగా ఈ శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్‌తో పాటు బీహెచ్‌ఈఎల్ ప్రాంతంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల ద్వారా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకులు వంద యూనిట్లు రక్తాన్ని సేకరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని అడ్వాన్స్‌డ్ సెంటర్ ఫర్ ఎండోక్రోనాలజీ (ఏసీఈ) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని ఆస్పత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. డయాబెటీస్, నేత్ర, థైరాయిడ్, బ్లడ్ సుగర్ తదితర సమస్యలకు ఉచిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్యాంప్ జరగనుందని డాక్టర్ రవితేజ తెలిపారు.

‘ఉద్యోగాల పేరిట బీజేపీ మోసం’



ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ ఎన్.మధురెడ్డి

మద్దిలపాలెం: ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేంద్రంలో గద్దెనెక్కిన బీజేపీ యువతను మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎన్.మధురెడ్డి ఆరోపించారు. మద్దిలపాలెంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే యువతకు సంవత్సరం కాలం వ్యవధిలో రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. వంద రోజుల్లో నిత్యావసర వస్తువులు ధరలను తగ్గిస్తామని నమ్మబలికారన్నారు. ప్రతి పేదవాడి అకౌంట్లో రూ.15లక్షలు వేస్తామని మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ చేసే వరకూ యువతరం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు కెల్లా రమణ, బన్ని, తేజా, నిశాంతు, వినయ్, కిరణ్, వైకుంఠరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్లబ్ ప్రారంభం



15వ వార్డులో బాక్సింగ్ క్లబ్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో బాక్సింగ్ క్లబ్‌ను ఆదివారం వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు ప్రారంభించారు. శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బాక్సింగ్ క్లబ్ జిల్లా బాక్సింగ్ క్లబ్‌కు అనుసంధానంగా ఉంటుందని గిరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమమంలో జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి అమ్మోరు, శెట్టిబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు గుతుల మధు, సంఘం ప్రతినిధులు, సిద్ధి వినాయక బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు చెల్లుబోయిన గోవింద్, ఉపాధ్యక్షుడు సంపంగి వాసు, తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా కోళ్ల వ్యర్థాల తరలింపు!



కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాను

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో అనధికారికంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యానును జీవీఎంసీ సిబ్బంది ఆదివారం అడ్డుకున్నారు. వ్యాను మాత్రం ఆగకుండా వెళ్లిపోయింది. జీవీఎంసీ 12వ వార్డులో ఆదివారం జరిగిన ఈ వ్యవహారంపై జీవీఎంసీ అధికారులు, వార్డు కార్పొరేటర్ వేర్వేరుగా స్పందించడం విశేషం. ఇక్కడ అధికారికంగా కోళ్ల వ్యర్థాల వ్యాపారం జరుగుతుందని అధికారులు అంటుండగా.. కార్పొరేటర్ అక్కరమాని రోహిణి మాత్రం అనధికారికంగా వ్యాపారం సాగుతోందని చెబుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆరిలోవ కాలనీ, అంబేడ్కర్‌నగర్, బాలాజీనగర్ ప్రాంతాలలో కోళ్ల వ్యర్థాలు సేకరించిన వ్యాపారి వ్యానులో బయటకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణి జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన అందుబాటులో ఉన్న సిబ్బందిని పంపించారు. చినగదిలి షిరిడీ సాయిబాబా ఆలయ సమీపంలో ఆ వ్యానును సిబ్బంది ఆపారు. అయితే అందులో కోళ్ల వ్యర్థాలు పరిశీలిస్తుండగానే.. సదరు వ్యాపారి కలుగుజేసుకొని వ్యానును ముందుకు తరలించేశాడు. దీనిపై కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ అధికారులకు ముందుగానే తెలియజేసిన నంబరుతో ఉన్న వ్యానులో మాత్రమే వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కానీ ఆరిలోవ ప్రాంతం నుంచి వ్యర్థాలను అనధికారిక వ్యాన్లలో కాపులుప్పాడకు కాకుండా వేరే ప్రాంతంలోని చేపలు చెరువుకు తరలిస్తున్నారని ఆమె ఆరోపించారు. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అధికారికంగానే తరలింపు

ఆరిలోవ ప్రాంతం నుంచి కోళ్ల వ్యర్థాలను కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు తరలించడానికి ఓ వ్యాపారికి అనుమతి ఉంది. బయట ప్రాంతాలకు మాత్రం తరలించడానికి వీలులేదు. కానీ బయట ప్రాంతాలకు తరలిస్తున్నట్లు కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలించడానికి సిబ్బందిని పంపించాం. సిబ్బంది పరిశీలిస్తుండగానే ఆ వ్యానును తీసుకెళ్లిపోయారు. ముందుగా అధికారులకు తెలియజేసిన నంబరు కలిగిన వ్యానులో మాత్రమే కోళ్ల వ్యర్థాలు తరలించాలి. వేరే వ్యానులో తరలించకూడదు. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కిశోర్, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ జోన్–2

మంచిగా జీవించండి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ సీహెచ్ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లకు పలు సూచనలిచ్చారు. నేరాల జోలికి పోకుండా మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. గొడవలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని నేరాలకు దూరంగా ఉండాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని రౌడీ షీటర్లను సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో..

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు ఎస్ఐ మోహన్‌రావు కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని వారికి సూచించారు.

100 మందికి వైద్య పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అపోలో ఆస్పత్రికి చెందిన వైద్యుడు సుమంత్ సిన్హా బృందం విద్యార్థులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 100 మందికిపైగా విద్యార్థులకు పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ డాక్టర్ సిహెచ్.ఆశా ఇమ్మానియల్ రాజు, వార్డెన్ డాక్టర్ కె.రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లు విసురుతున్న సాంకేతిక మార్పులు



ప్రసంగిస్తున్న కామత్

ఏయూ క్యాంపస్: మారుతున్న సాంకేతికత.. ఉపాధి అవకాశాల కల్పనలో సవాళ్లు విసురుతోందని విప్రో సంస్థ హెచ్‌ఆర్ విభాగం జీఎం కె.ప్రవీణ్ కామత్ అన్నారు. ఆదివారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విద్యార్థులను ఉద్దేశించి కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బహుళ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో నూతనంగా అవతరించే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాలను కలిగి ఉండాల్సిన విధానాలను తెలియజేశారు. హెచ్‌ఆర్ రంగంలో వస్తున్న నూతన పోకడలు, అవకాశాలు వివరించారు. ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విధానం, ప్రణాళిక, అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలలో 85 శాతానికి పైగా రానున్న రెండు దశాబ్దాల కాలంలో కనుమరుగవుతాయన్నారు. అధునాతన సాంకేతికతను మిళితం చేస్తూ అభ్యసనం చేసే వారికి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో విద్యార్థులకు ఎదురయ్యే సవాళ్లను ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఈ ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ ఎస్.కె.ప్రసాద్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఏయూ సిబ్ ఏవో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.

భానునగర్‌లో పార్కు ప్రారంభం



పార్కు ప్రారంభించి మొక్కలు నాటుతున్న 16వ వార్డు కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు భానునగర్‌లో ఆధునికీకరించిన విద్యానగర్ పార్కును ఆదివారం కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు ప్రారంభించారు. పార్కులో ఓపెన్ జిమ్‌ను, ఆహ్లాదకరమైన వాతవరణం కోసం ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు చిన్నారులు ఆడుకునేలా పరికరాలు పార్కులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని కార్పొరేటర్ లక్ష్మి తెలిపారు. వాకింగ్ ట్రాక్ అందుబాటులో ఉందన్నారు. పార్కును సద్వినియోగం చేసుకుని, చక్కగా నిర్వహణ చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, తదితరులు పాల్గొన్నారు.

‘బీసీ చలో ఢిల్లీ’ విజయవంతానికి పిలుపు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు 3, 4 తేదీల్లో ఢిల్లీ వేదికగా బీసీల రాజ్యాధికారం, హక్కుల సాధనే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే అనేక సన్నాహక సభలు నిర్వహించినట్టు తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ఆమోదం, ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు, కేంద్రం నిర్వహిస్తున్న జనగణనలో బీసీ కులాల లెక్కింపు, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, రైల్వే, ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థల ప్రైవేటీకరణ రద్దు వంటి డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్రకు చెందిన బీసీ నాయకులు, కుల సంఘాల నాయకులు, బీసీ ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

మే 1న బల్లిగిరి వెంకన్న వార్షిక కల్యాణోత్సవం



విశేష అలంకరణలో బల్లిగిరి వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం మే 1వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి వారం రోజుల పాటు విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, 1001 కలశాలతో విశేష అభిషేకాలు, పుష్పయాగం తదితర ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల భక్తులు దేవస్థానం కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. భక్తుల సహకారంతో ప్రతి ఏడాది స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపడుతున్నామన్నారు.